సాక్షి
కుమురం భీం

ఆదివారం । 21 । మే । 2023



అన్నీ శుభఘడియలే..
ఈ నెల 21నుంచి జూన్ 14వ తేదీ వరకు శుభముహూర్తాలున్నాయి. వివాహాలు, శుభ కార్యాలు చేసేవారు ముందుగానే తేదీలు ఖరారు చేసుకుంటున్నారు. 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం
ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పదోతరగతిలో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరం కార్పొరేట్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల జిల్లా అధికారి సజీవన్ తెలిపారు. 7.0 జీపీఏకు పైగా ఉన్న విద్యార్థులు జూన్ 3వరకు www.telangana epass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
42.0 /29.0

వాతావరణం
చాలావరకు ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. చాలాచోట్ల వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

క్రీడా పోటీలు విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్: జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు విజయవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హాకీ జట్టులో (16 మంది పురుషుల బృందం), ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్ (పురుషులకు), టేబుల్ టెన్నిస్ పోటీల్లో ట్రయల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 22న రిజిస్ట్రేషన్ చేసుకొని పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్ పోటీలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ పోటీలు గోలేటి సింగరేణి స్టేడియంలో, ఫుట్‌బాల్ పోటీలు ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో, బాక్సింగ్ పోటీలు కాగజ్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, వివరాలు నమోదు చేసుకొని పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా క్రీడా, యువజనశాఖ కార్యాలయంలో గాని, 8008090626లో సంప్రదించాలని సూచించారు.

కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాజేశం సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లు, రైస్ మిల్లులకు తరలింపు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకునేలా అధికారులు, రైస్‌మిల్లుల యజమానులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బండారు రవికుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. ఐకేపీ వీవోఏలు సమస్యల పరిష్కారానికి చేపట్టిన దీక్ష శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, రూ.10లక్షలు సాధన బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతీనెల వేతనాలను వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆన్‌లైన్ పనులు చేయించరాదని, ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, నాయకులు రాజేందర్, రమ, సునీత, గణేశ్, కల్పన, శ్రీలత, అర్చన ఉన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

సిర్పూర్(టి): గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శనివారం వేంపల్లి పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయ భవనం, వాటర్‌ప్లాంట్, 'మన ఊరు–మన బడి' పనులు, పంచాయతీ భవన పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. గ్రంథాలయానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, డీఎల్పీవో సురేశ్‌కుమార్, సర్పంచ్ డోలె లక్ష్మి తదితరులున్నారు.

శంభో.. శివ శంభో!



గుండి రోడ్డు వద్ద రూ.1.60 కోట్లకు విక్రయించిన భవనం

- గిరిజనుల భూములకు రెక్కలు
- ఆసిఫాబాద్‌లో నయా దందా
- ఏజెన్సీ భూముల్లో గిరిజనేతరులు
- అక్రమంగా భవంతుల నిర్మాణం
- నిబంధనలకు విరుద్ధంగా అమ్మకం
- తాజాగా గుండిరోడ్డులో ఓ భవనాన్ని రూ.1.60 కోట్లకు విక్రయం

సాక్షి, ఆసిఫాబాద్: గిరిజనుల ఖిల్లా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వారి భూములకే రక్షణ లేకుండా పోయింది. గిరిజనులకు చెందిన విలువైన భూముల్లో బడాబాబులు పాగా వేస్తున్నారు. కారుచౌకగా కొనుగోలు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆసిఫాబాద్‌లో నయా దందాకు తెరతీశారు. వాస్తవానికి గిరిజనేతరులు నోటిఫైడ్ ఏరియాలోని భూములు కొనుగోలు చేయరాదు. ఈ అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడంతో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా రియల్ వ్యాపారం సాగుతోందన్న విమర్శలు వినవస్తున్నాయి.

రూ.కోట్ల అర్జన
గుండి రోడ్డు రహదారి వెంట వందలాది ఎకరాల ఏజెన్సీ భూములున్నాయి. ఇక్కడ అధికారపార్టీ నేతల అండతో అక్రమంగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించారు. ఈ ప్రాంతంలో ఇప్పుడు వందల సంఖ్యలో భవంతుల నిర్మాణం జరగడం గమనార్హం. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మామూళ్లు ముట్టజెప్పడంతో 'కళ్లు మూసుకున్నాం.. కానిచ్చేయండి' అన్న ధోరణిలో అధికారులు మిన్నకుండి పోయారన్న విమర్శలున్నాయి. ఆసిఫాబాద్‌లో ఏజెన్సీ భూములు కొనుగోలు చేయడంలో సిద్ధహస్తుడైన ఓ వ్యాపారి గుండి రహదారిలో అక్రమంగా ఏజెన్సీ భూమిని కొనుగోలు చేయడమే కాకుండా అందులో ఏకంగా ఓ మూడంతస్తుల భవనాన్ని నిర్మించాడు. చెక్‌పోస్టు రోడ్డులోని బీడీపీపీ భూములు ఇలాగే విక్రయించి రూ.కోట్లు సొమ్ము చేసుకోవడం విశేషం. ఇటీవల గుండి రోడ్డులోని ఆ భవనాన్ని రూ.1.60 కోట్లకు ఆసిఫాబాద్‌లోని కొందరు వ్యాపారులకు విక్రయించాడు. ఆ భవనాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు కూడా ఇలాగే జిల్లా కేంద్రంలో ఎడాపెడా భూములు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. అయితే రూ.కోట్ల లావాదేవీలు చేస్తున్న ఈ వ్యాపారులెవరూ ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలో లేకపోవడం విడ్డూరం. అనధికార లావాదేవీలతో ప్రభుత్వాదాయానికి గండి కొడుతుండగా వీరిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పేరొకరిది.. సొమ్మొకరికి!
ఏజెన్సీ భూములు గిరిజనేతరులు కొనరాదు.. విక్రయించరాదు. కానీ.. ఆసిఫాబాద్‌లో మాత్రం ఏజెన్సీ భూములన్నింటినీ గిరిజనేతరులు కొనేస్తున్నారు. అయితే ఎక్కడా వారి పేరిట కొనుగోలు చేసినట్లు ఆధారాలుండవు. తమకు నమ్మకస్తుడైన గిరిజనుడి పేరు మీదే ఆ భూములుంటాయి. కొనుగోళ్ల అగ్రిమెంట్ బాండ్‌పేపర్ మీద మాత్రమే వారి పేర్లుంటాయి. అనంతరం ఆయా భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వెలుస్తున్నాయి. ప్లాట్లు చేసి అమాయకులకు (గిరిజనేతరులు) బాండ్‌పేపర్ మీద విక్రయిస్తున్నారు. గిరిజనుడైతే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారు. ఒక్కో ప్లాటును రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు విక్రయిస్తూ రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్లు వెలుస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

డబుల్‌రోడ్డు మంజూరు చేయాలి



ఎమ్మెల్యే సక్కుతో కలిసి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి నూతన సచివాలయంలో రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండో తిరుపతిగా పేరుగాంచిన గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. మండల కేంద్రం నుంచి ఆలయం వరకు రెండు వరుసల రోడ్డుతోపాటు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సింగిల్ రోడ్డుతో ఏటా ఆలయం వద్ద నిర్వహించే జాతరలో భాగంగా లక్షలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుండగా ట్రాఫిక్ జామ్ అవుతూ అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వారి వెంట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశంచారి, నంబాల మాజీ సర్పంచ్ కొవ్వూరి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకుడు గుంపుల విమలేశ్ ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో టచ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా పిరమిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా మారుమూల గిరిజన గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇంటి వద్ద ఉంటున్నందున వారిలోని సామర్థ్యాలను బయటకు తీసి వారి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. జిల్లాలోని ప్రతీ గిరిజన గ్రామాన్ని సందర్శించాలని, గ్రామాల్లో గ్రామ పటేల్, సర్పంచ్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలను కలిసి వారి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. మూడు నుంచి 16 ఏళ్ల వయస్సుగల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని వివరించారు.

పట్టుదలతో ఉన్నతస్థాయికి చేరుకోవాలి
రెబ్బెన(ఆసిఫాబాద్): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. శనివారం మండలంలోని వంకులం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జాయ్‌ఫుల్ లెర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును పరిశీలించారు. క్యాంపులో నేర్చుకున్న అంశాలపై విద్యార్థులు ప్రదర్శన ఇవ్వగా తిలకించారు. విద్యార్థులు సాధించిన ప్రగతిపై సంతృప్తి వ్యక్తంజేశారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషలో స్పష్టంగా మాట్లాడడం ఆనందంగా ఉందని వారిని అభినందించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం జాడి ప్రభాకర్, సెంటర్ నిర్వాహకుడు రాజకమలాకర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రకాశ్, వార్డు సభ్యులు ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ ముందుండాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ సురేశ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): యువత చదువుతోపాటు క్రీడల్లోనూ ముందుండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం సాయంత్రం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చే క్రీడాకారులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు సహాయ, సహకారాలు ఉంటాయని చెప్పారు. ప్రతీ ఒక్కరు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15,116, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10,116 నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదట గోలేటి, గుండాల జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, బెల్లంపల్లి జీఎం దేవేందర్, రెబ్బెన సీఐ నరేందర్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఆసిఫాబాద్ సీఐ రాణాప్రతాప్, జైనూర్ సీఐ రామకృష్ణ, ఎస్వోటూ జీఎం గుప్తా, ఎస్సైలు భూమేశ్, రమేశ్, గోలేటి సర్పంచ్ పోటు సుమలత తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి



చింతకర్ర వంతెన పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: వేసవి పూర్తయ్యేలోపు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అధికారులను ఆదేశించారు. జైనూర్ మండలం చింతకర్ర గ్రామంలోని వంతెన పనులను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం రూ.4.96 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ వంతెన పూర్తయితే చింతకర్ర, కిషన్‌నాయక్‌తండా, తాటిగూడతోపాటు సమీప గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. దీంతో ఈప్రాంత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. గతంలో వంతెన లేక వానాకాలంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురి కాగా, వంతెన మంజూరు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, గ్రామస్తులున్నారు.

కలెక్టర్‌కు కలాం విగ్రహం అందజేత



కలాం విగ్రహాన్ని కలెక్టర్ హేమంత్ బోర్కడేకు ఇస్తున్న డీఐఈవో

ఆసిఫాబాద్‌రూరల్: భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం టేబుల్ టాప్ విగ్రహాన్ని కలెక్టర్ హేమంత్ బోర్కడేకు డీఐఈవో శ్రీధర్ సుమన్ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం విగ్రహం, పుస్తకాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలలకు హైదరాబాద్‌కు చెందిన కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ (కేఐకేఈ) స్వచ్ఛంద సంస్థ అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్‌కు మొదట అబ్దుల్ కలాం విగ్రహాన్ని కానుకగా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రేషన్‌డీలర్లు

ఆసిఫాబాద్: గౌరవవేతనం చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుందారపు గోపాల్ మాట్లాడారు. చాలీచాలని కమీషన్‌తో ఇబ్బందులకు గురవుతున్న తమకు గౌరవవేతనం రూ.30 వేలు చెల్లించాలని, క్వింటాల్‌కు ఒకశాతం తరుగు ఇవ్వాలని, ప్రతీనెల ఈపాస్ మిషన్ నుంచి తరుగు ఒకశాతం తొలగించాలని కోరారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ వద్ద వివిధ రకాల్లో ఉన్న కమీషన్ డబ్బులు, కోవిడ్‌తో చనిపోయిన డీలర్ల కుటుంబీకులకు పరిహారం, చనిపోయిన డీలర్ దహన సంస్కారాలకు రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూన్ 5లోపు సమస్యలు పరిష్కరించకుంటే జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దుకాణాలు మూసి వివిధ రూపాల్లో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీహెచ్ తిరుపతి, హెచ్ శ్రీనివాస్, రాపర్తి నర్సింహస్వామి, రాపర్తి శ్రీనివాస్, సుధాకర్, పాండురంగ్, కే వెంకటేశ్వర్లు, బీ సతీశ్, సృజిత్, షేక్ అబ్దుల్ వహిద్, పీ ప్రభాకర్, బసవయ్య, శంకర్, భగవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న రవికుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని ఉపాధిహామీ పని స్థలాల్లో కూలీలు, సిబ్బందికి వసతులు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధిహామీ పని స్థలాల్లో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలని తెలిపారు. టెంట్లు వేసి నీడ సౌకర్యం కల్పించాలని కోరారు. కూలీలకు పెండింగ్‌లో ఉన్న అక్టోబర్, నవంబర్, డిసెంబర్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం, సీపీఎం రాష్ట్ర నాయకత్వం, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కృషి ఫలితంగా అటవీశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం 2016 నుంచి ఇవ్వడానికి సిద్ధపడి ముందుగా జిల్లా నుంచే ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ చాలామంది లబ్ధిదారులకు బోనస్ అకౌంట్‌లో పడలేదని తెలిపారు. త్వరగా బోనస్ విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, అల్లూరి లోకేశ్, ముంజం శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, రాజ్‌కుమార్, అశోక్, రాజేందర్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



రవీంద్రనగర్-2లో ఇంటిపై కూలిన చెట్టు

చింతలమానెపల్లి: మండలంలో శనివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. బాబాసాగర్, రవీంద్రనగర్–2, గిన్నెలేటి, గంగాపూర్, కారెబ్బెన తదితర గ్రామాల్లో భారీగాలులు వీయగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పలుచోట్ల చెట్లు నేలకూలగా సమీప ఇళ్లు దెబ్బతిన్నాయి. రవీంద్రనగర్–2లోని ఉత్తమ్ బచర్ ఇంటిపై పెద్ద వృక్షం కూలింది. ఇంటి పక్కనున్న విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కౌటాల మండలంలో..
కౌటాల: మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మండలవాసులు వేడి నుంచి కొంత ఉపశమనం పొందారు. కాగా, యాపలగూడ, గురుడుపేట్, బోదంపల్లి, కన్నెపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని కోసిని గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శనివారం అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట డీఎల్పీవో సురేశ్‌బాబు, ఎంపీడీవో గౌరీశంకర్ ఉన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో..
కాగజ్‌నగర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య మిషన్ కార్యక్రమాన్ని శనివారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పరిశీలించారు. ఎనిమిదో వార్డులో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యం పూర్తయ్యేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. చికెన్, మటన్, ఫిష్ విక్రయ కేంద్రాల్లో వ్యర్థాల తొలగింపు విధానంపై వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

క్లుప్తంగా

పనివేళలు మార్చాలని సీఎండీకి లేఖ

శ్రీరాంపూర్(మంచిర్యాల): మండుతున్న ఎండలకు సింగరేణి కార్మికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఓసీపీల్లో పనివేళలు మార్చాలని కంపెనీ సీఎండీకి శనివారం లేఖ రాసినట్లు గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్నిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో కార్మికులు పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఓసీపీల్లో మొదటి షిఫ్ట్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్ట్ సాయంత్రం 4 నుంచి 11 గంటల వరకు ఏర్పాటు చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాముని చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు చెరువువద్దకు వెళ్లి పరిశీలించగా మృతుని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని, ఒంటిపై బట్టలులేవని, శరీరం పూర్తిగా కుళ్లిపోయి ఉందన్నారు. సుమారు ఐదు రోజుల క్రితం మృతి చెందినట్లుగా ఉందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లె దవాఖానా పనితీరు పర్యవేక్షణ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గఢ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలోని పనితీరును శనివారం మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్య శాఖా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్ఓ రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ రిజిస్టర్లు పరిశీలించి సూచనలు చేశారు. పల్లె దవాఖానా ద్వారా గ్రామంలో 8 మంది మహిళలు కు.ని ఆపరేషన్ చేయించుకునేలా కృషి చేసిన సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుధాకర్, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నీ శుభఘడియలే..

- నేటినుంచి జూన్ 14 వరకు ముహూర్తాలు



దండేపల్లి(మంచిర్యాల): పెళ్లంటే నూరేళ్ల పంట.. అంతే కాదు.. విభిన్న వృత్తుల వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే క్రతువు. మే, జూన్ మాసాల్లో ఎక్కువగా మంచి ముహూర్తాలుంటాయి. గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు చేసుకునేవారు ఈ శుభసమయాల్లో ముహూర్తాలు కుదుర్చుకుంటారు. జూన్18 నుంచి ఆగస్టు18 వరకు మౌఢ్యమి కారణంగా వివాహాలు, శుభకార్యాలు నిర్వహించరాదు. ఈ నెల 21, 22, 24, 25, 27, 28, 31 తేదీలతో పాటు జూన్ 1, 2, 3, 5, 7, 8, 10, 12, 14 తేదీల్లో శుభముహూర్తాలున్నాయి. దీంతో వివాహాలు, శుభకార్యాలు చేసేవారు ముందుగానే ముహూర్తపు తేదీలు ఖరారు చేసుకుంటున్నారు.



ముందస్తు బుకింగ్‌లే..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఇదివరకే వివాహాలకు ముహూర్తాలు ఖరారు చేసుకున్న వారంతా తమ తేదీలకు తగ్గట్టుగా ఫంక్షన్‌హాళ్లను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు, పురోహితులకు కూడా అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. వంట మనుషులను కూడా ముందే మాట్లాడి పెట్టుకుంటున్నారు. జిల్లాలో ఫంక్షన్‌హాళ్ల కొరత ఉండడంతో ఇవి దొరకనివారు ఇండ్ల వద్ద మైదాన ప్రాంతాల్లో వివాహాలు జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

చాలా మందికి ఉపాధి

వరుస ముహూర్తాలతో వివాహాది శుభకార్యాలపై ఆధారపడి ఉపాధి పొందేవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టెంట్‌హౌస్, డెకరేషన్, బ్యాండ్, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, వివిధ రంగాల వారు ఈ 25 రోజుల పాటు బిజీగా ఉంటారు.

జూన్ 14వరకే ముహూర్తాలు



ఈ నెల 21 నుంచి జూన్ 14 వరకు వరుస ముహూర్తాలున్నాయి. జూన్ 18 నుంచి ఆగస్టు 18 వరకు మౌఢ్యమి ఉన్నందువల్ల ఈ సమయంలో శుభకార్యాలు చేయరాదు. మే, జూన్‌లో ఉన్న 25 రోజుల వరుస శుభముహూర్తాలను వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేవారు వినియోగించుకోవడం మంచిది.

– బ్రహ్మశ్రీ గొల్లపెల్లి రామానందచార్యస్వామి, వేదపండితుడు, ఇటిక్యాల

ఆర్టీసీపై ఎండల ప్రభావం

- ప్రయాణానికి జంకుతున్న ప్రజలు
- రోజురోజుకు తగ్గుతున్న ఆదాయం
- అనారోగ్యం బారిన కార్మికులు

మంచిర్యాల ఆర్టీసీ డిపో ఆదాయం ఇలా..

తేదీ	ఆదాయం(రూ.ల్లో)
14	29,55,147
15	30,64,472
16	26,34,501
17	26,81,710
18	25,57,028
19	22,77,775



మంచిర్యాల ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు

మంచిర్యాలఅర్బన్: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆర్టీసీపై ప్రభావం చూపుతున్నాయి. మండుతున్న ఎండలు.. వడగాల్పుల భగభగలతో ప్రయాణికులు ఉక్కిరి బిక్కిరి అవుతుండడంతో ప్రయాణం వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఖాళీ సీట్లతోనే బస్సులు తిరుగుతుండడంతో ఆర్టీసీకి ఆదాయం తగ్గి నష్టాల్లోకి నెడుతోంది. మంచిర్యాల ఆర్టీసీ డిపోలో 145 బస్సులు వివిధ రూట్లలో తిరుగుతున్నాయి. రోజుకు రూ.32 లక్షలు ఆదాయం రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.25 లక్షలకు చేరింది. మునుపెన్నడూలేని విధంగా మంచిర్యాల డిపో ఆదాయంలో వెనుకబడి పోతోంది.

అనారోగ్యం బారిన కార్మికులు

రోజురోజుకూ భానుడు తన ప్రతాపం చూపుతుండడంతో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఒకవైపు ఎండల తీవ్రత.. మరోవైపు బస్సు ఇంజన్ వేడితో డ్రైవర్లు నరకయాతన పడుతున్నారు. గంటల తరబడి బస్సుల్లోనే ఉండాల్సి వస్తుండడంతో కండక్టర్లు, డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండలోనే విధులు నిర్వహిస్తుండడంత వల్ల జ్వరం, వాంతులు, విరేచనాలు, నీరసం, కళ్లు తిరిగి పడిపోవడం, కాళ్లు లాగడం, తదితర లక్షణాలతో ఆర్టీసీ వైద్యశాలకు పరుగులు తీస్తున్నారు. ఇలాంటి లక్షణాలతో రోజుకు 6 నుంచి పదిమంది వైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు అధికారులు డబుల్ డ్యూటీలతో తిప్పలు పెడుతున్నారని కార్మికులు వాపోతున్నారు. పనిగంటలు పెంచి డ్యూటీ వేయటం వల్ల బ్యాక్‌పెయిన్, తదితర రోగాల బారినపడి పది నుంచి పదిహేను రోజుల వరకు సిక్‌లీవులు పెట్టిన వారున్నారు. ఆర్టీసీ డిపోలో మధ్యాహ్నం అంబలి పంపిణీ చేస్తుండడం కార్మికులకు ఉపశమనం కలిగిస్తోంది.

జాగ్రత్తలు పాటించాలి

రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. కొబ్బరిబోండం, ఓఆర్ఎస్‌తో కలిపిన నీరు తీసుకుంటే మంచిది. నీళ్లు ఎక్కువగా తాగాలి. సమయానికి ఆహారం తీసుకోవాలి. హోటల్, ఇతరత్రా బయట ఆహారం తీసుకుంటే వాంతులు, విరేచనాల బారిన పడే అవకాశాలున్నాయి. తలకు తెల్లటి క్లాత్, మాస్కులు, టోపీలు ధరించాలి.

– పరంజ్యోతి, వైద్యుడు, ఆర్టీసీ ఆస్పత్రి, మంచిర్యాల

దర్జాగా విద్యుత్ చౌర్యం!



ఐడిల్ లైన్‌కు కొండీలు వేసిన దృశ్యం



ఐడిల్ లైన్‌కు కొండీలు వేసిన దృశ్యం

- గ్రామ ట్రాన్స్‌ఫార్మర్‌కు కొండీలు తగిలించి కరంటు వాడకం
- ప్రమాదవశాత్తు కార్మికుడికి విద్యుత్ షాక్

వేమనపల్లి(బెల్లంపల్లి): కోట్లాది రూపాయలు వెచ్చించి వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ విద్యుత్ సౌకర్యంకోసం అడ్డదారి తొక్కాడు. ముల్కలపేట గ్రామ అవసరాలకు ఉపయోగించే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిరుపయోగంగా ఉన్న విద్యుత్‌లైన్‌కు కొండీలు తగిలించి విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడు. ఫలితంగా నిర్మాణపనుల్లో ఉన్న కార్మికుడు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... వేమనపల్లి మండలంలోని ముల్కలపేట, రాచర్ల గ్రామాల మధ్య సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) ప్యాకేజీ కింద రెండు హైలెవల్ వంతెనలు నిర్మిస్తున్నారు. అక్కడ కాంట్రాక్ట్ సిబ్బంది క్యాంపు కూడా ఏర్పాటు చేశారు. రాడ్ కట్టింగ్, ఇతర అవసరాలకు విద్యుత్ తప్పనిసరి. ఇందుకు గుత్తేదారు ట్రాన్స్‌కోకు దరఖాస్తు చేసుకుని డీడీ కట్టి వారి అనుమతితో ట్రాన్స్‌ఫార్మర్, మీటర్ ఏర్పాటు చేసుకోవాలి. కానీ అవేం పట్టించుకోకుండా విద్యుత్ చౌర్యానికి ఒడిగట్టారు.

కరంటు తీగలకు కొండీలు తగిలించి..

వంతెన నిర్మాణ పనుల వద్ద నిరుపయోగంగా ఉన్న ఐడిల్ విద్యుత్ లైన్‌పై గుత్తేదారు కన్నేశాడు. ఈ లైన్ గతంలో కోటపల్లి మండలం జనగామ, అలుగామ ఎత్తిపోతల పథకం కోసం నీల్వాయి సబ్‌స్టేషన్ నుంచి సుమారు 10 కిలోమీటర్ల విద్యుత్ లైన్ నిర్మించారు. నిరుపయోగంగా ఉన్న ఈ ఐడిల్ లైన్‌కు ముల్కలపేట వాటర్ ట్యాంకు వద్ద గ్రామ అవసరాల కోసం అమర్చి ఉన్న 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుమతి లేకుండా కొండీలు తగిలించారు. అక్కడి నుండి సుమారు 2 కిలోమీటర్ల దూరం విద్యుత్ సరఫరా ఇచ్చి నిర్మాణ పనులకు వాడుకుంటున్నారు. వంతెన వద్ద కార్మికులు పని చేస్తుండగా బుధవారం చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమ జిల్లాకు చెందిన బబ్లు అనే కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విషయం బయటికి రాకుండా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇంత జరుగుతున్న ట్రాన్స్‌కో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ దీపక్‌ను వివరణ కోరగా విద్యుత్ షాక్ ఘటన జరిగింది నిజమేనన్నారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్నారన్న విషయం తెలియదంటూనే గంటల వ్యవధిలో ముల్కలపేటకు వెళ్లి కొండీలు తగిలించి ఉన్న చోట తీగలను తొలగించారు. వంతెన పనుల వద్ద విద్యుత్ స్తంభానికి సైడ్ ఆరమ్ బిగించారు.

ప్రియురాలు మోసం చేసిందని..

- యువ కార్మికుడు బలవన్మరణం
- రెండు నెలల క్రితమే సింగరేణి ఉద్యోగం
- శ్రీరాంపూర్‌లో ఘటన



ప్రణయ్(ఫైల్)

శ్రీరాంపూర్(మంచిర్యాల): వారిద్దరూ ప్రేమించుకున్నారు. కలిసి తిరిగారు.. తమ ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లాలని అనుకున్నారు. తండ్రి సింగరేణి ఉద్యోగం కూడా వచ్చే అవకాశం ఉండడంతో పెళ్లి తర్వాత ఎలా స్థిరపడాలో కలలు కన్నారు. కానీ, ఇంతలో ఏమైందో ఏమో ప్రియురాలు మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఉద్యోగంలో జాయిన్ కాగానే పెళ్లికి ప్లాన్ చేసుకోగా, ఇంతలోనే ప్రేయసి మోసం చేయడంతో అతను తట్టుకోలేకపోయాడు. రెండు నెలల క్రితం సింగరేణి కార్మికుడిగా విధుల్లో చేరినా.. వెంటాడుతున్న ప్రేయసి జ్ఞాపకాలతో మనస్తాపం చెందాడు. ఆమె లేని జీవితం తనకు వద్దనుకున్నాడు. శుక్రవారం రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్‌లో జరిగింది. శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గణేశ్‌నగర్‌కు చెందిన చిప్పకుర్తి చంద్రయ్య, పోశమ్మ దంపతులకు తిరుపతి, ప్రణయ్ ఇద్దరు సంతానం. సింగరేణి కార్మికుడిగా పనిచేస్తున్న చంద్రయ్య ఇటీవలే మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయ్యాడు. తన ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద కుమారుడు ప్రణయ్(23)కు ఇచ్చాడు.

జాబ్ వస్తే సెటిల్ అవుదామని..

బెల్లంపల్లికి చెందిన యువతిని కొంత కాలంగా ప్రేమిస్తున్న ప్రణయ్ తండ్రి ఉద్యోగం తనకు రాగానే లైఫ్ సెట్ అవుతుందని భావించాడు. ఈమేరకు సింగరేణి శిక్షణ కూడా పూర్తి చేసుకున్నాడు. ఇంతలో ప్రియురాలు మనసు మార్చుకుంది. కారణం చెప్పకుండానే మరో యువకుడిని పెళ్లి చేసుకుంది. దీంతో ప్రణయ్ మనస్తాపం చెందాడు. కానీ, అతని తల్లిదండ్రులు, స్నేహితులు ధైర్యం చెప్పారు. జాబ్ వచ్చాక.. మరో అమ్మయితో ఘనంగా పెళ్లి చేస్తామని నచ్చజెప్పారు.

రెండు నెలల క్రితం ఉద్యోగం..

ఈ క్రమంలో రెండు నెలల క్రితం ప్రణయ్ సింగరేణి ఉద్యోగంలో చేరాడు. ఎస్సార్పీ 3, 3ఏ గనిలో బదిలీవర్కర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ప్రియురాలిని మాత్రం మర్చిపోలేకపోయాడు. ఆమె జ్ఞాపకాలు తరచూ వెంటాడుతుండడంతో ఆమె చేసిన మోసాని తలచుకుని మదనపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని ఆత్మహత్య



శారద(ఫైల్)

శ్రీరాంపూర్(మంచిర్యాల): భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని భార్య ఆత్మహత్య చేసుకున్న ఆర్కే 6 హట్స్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల కాలనీకి చెందిన గోపు సారయ్య కూతురు శారద(32)కు దండేపల్లి మండలంలోని నంబాలకు చెందిన పెట్టం రామకృష్ణతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు నాలుగేళ్ల కూతురు ఉంది. కూతురు పుట్టినప్పటి నుంచి భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదు. దీంతో మనస్థాపం చెందిన మహిళ శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి పైకప్పుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో స్థానికులు వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి సోదరుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి వృద్ధుడు..

లక్సెట్టిపేట(మంచిర్యాల): గోదావరిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బీట్‌బజార్‌కు చెందిన కొత్త కాంతయ్య(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. శనివారం స్థానిక గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని విజయ్‌బస్తీలో అక్రమంగా దేశీదారు బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టుచేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బుద్దేస్వామి తెలిపారు. ఎస్సై కల్యాణ్ బస్తీలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానం వచ్చిన ఇద్దరు యువకులను తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న సంచిలో 298 దేశీదారు బాటిళ్లు లభ్యమయ్యాయి. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులు గౌస్, షబ్బీర్ హుస్సేన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'అవకతవకలపై విచారణ జరపాలి'

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నల్ల నాగేంద్ర ప్రసాద్, నయీంపాషా కలెక్టరేట్‌లో ఏవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా రాజకీయ పలుకుబడి, డబ్బులు ఇచ్చిన వారికే ఉద్యోగం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల శ్రీనివాస్, కొంటి రాజు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి'



అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

పాతమంచిర్యాల: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులకు రక్షణ ఇవ్వలేని కేంద్ర ప్రభుత్వం సాధారణ మహిళలకు ఎలాంటి రక్షణ కల్పిస్తుందో తెలిసిపోతుందన్నారు. బెంజర్ల ఉమ, అచ్చే విజయ, మంజుల, బాకం విజయ పాల్గొన్నారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి

- సకాలంలో స్పందించని 108 సిబ్బంది



భారతి(ఫైల్)

భీమారం(చెన్నూర్): ఇంట్లో టీవీ చూస్తుండగా పాముకాటుకు గురైన దుర్గం భారతి (15) అనే విద్యార్థిని సకాలంలో వైద్యం అందకపోవడంతో మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా భీమారం మండలం కొత్తపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దుర్గం బాపు, శంకరమ్మ దంపతుల కూతురు భారతి భీమారంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. వేసవి సెలవులకు స్వగ్రామం కొత్తపల్లికి వచ్చింది. శుక్రవారం రాత్రి ఇంట్లో చాపపై పడుకుని టీవీ చూస్తుండగా మోచేతి వద్ద పాము కాటు వేసింది. సర్పంచ్ గోదరి తిరుపతి 108కు సమాచారం అందించేందుకు గంటపాటు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో 100కు ఫోన్ చేశారు. పోలీసుల సాయంతో లైన్‌లోకి వచ్చిన 108 సిబ్బంది అప్పటికే ఆలస్యమైందని, వెంటనే ప్రైవేట్ వాహనంలో తీసుకురావాలని సూచించారు. కారులో మంచిర్యాలకు తీసుకెళ్తుండగా ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద 108 ఎదురైంది. వెంటనే అందులో ఎక్కించి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. 108 సిబ్బంది సకాలంలో స్పందిస్తే విద్యార్థిని బతికేదని సర్పంచ్ తిరుపతి అన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: ఇటీవల పదోతరగతి ఫలితాల్లో 7 గ్రేడ్, ఆపైన మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పాస్ వెబ్‌సైట్ https://telanganaepass. cgg. gov. in ద్వారా ఈ నెల 22 నుంచి జూన్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

'అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వాలి'

కోటపల్లి: గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ విద్యాసాగర్ అన్నారు. శనివారం మండలంలోని వెంచపల్లి, జనగామ, ఆలుగామ ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలతో పాటు ప్రాణహిత ఫెర్రి పాయింట్స్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పడవల యజమానులు, సరిహద్దు ప్రాంతాల గుండా వచ్చిపోయే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణహిత నది తీర ప్రాంతాల్లో తునికాకు కల్లం వద్దకు వెళ్లి సమాచారం అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకరావాలని సూచించారు.

రగ్బీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): రగ్బీ జిల్లా జట్ల ఎంపిక పోటీలను శనివారం నస్పూర్‌లోని సాధన గ్రీన్ కిడ్స్ ప్లేస్కూల్‌లో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొండ చంద్రశేఖర్ పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జట్లు ఈ నెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇనిస్టిట్యూట్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆవునూరి మహేశ్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్, పీ ఈటీలు రాజలింగు, రాజశేఖర్, రవీందర్ పాల్గొన్నారు.

'బీసీలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం'

పాతమంచిర్యాల: బీసీలను విస్మరించిన పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 65 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల జనాభా 56 శాతం, ఓట్ల శాతం 54.75 ఉందన్నారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి రావాలన్నా బీసీల ఓట్లతోనే సాధ్యం అన్న విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మూడు ప్రధాన రాజకీయ పార్టీలకు లేఖలు రాసారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కోకన్వీనర్ సంగం లక్ష్మణ్, మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు సూరినేని కిషన్, యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి గడ్డం సతీష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాల్గొన్నారు.

యువతిని వేధించిన కేసులో ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని విద్యానగర్‌కాలనీకి చెందిన షిండే రోహిత్ ప్రేమ పేరిట ఓ యువతిని కొంతకాలంగా వేధిస్తున్నాడు. సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టి పరువు తీస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో శనివారం సదరు యువతి తండ్రి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై జి.నారాయణ, హెడ్ కానిస్టేబుల్ రాములు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.